# నీతి ఖరీదెంత

"సుందర్రావు ఎంత మంచివాడంటే" అన్నాడు. భావనారాయణ సిగరెట్టుకొసని చిటికెనవేలితో సుతారంగా రాల్చుతూ; "అతనంత మంచివార్ని నేను చాలా కొద్దిమందిని చూశాను...అవును...డాక్టర్ సుందర్రావునుగురించే నేను చెపుతూంట."

"డాక్టర్లో మంచితనం ఉంటే ఆర్జన తగ్గిపోతుందంటారు గదా—" అన్నాను నేను.

భావనారాయణ ఓ కొలినాస్ చిరునవ్వు నవ్వి, కనుబొమలు ఓసారి కదిలించాడు.

"నిజమేగానీ సుందర్రావలాంటివాడు కాదు. అతను ఆర్జించడం విషయంలో చాలా నిపుణుడు. అని- ఉత్తినే- అద్దుడుకాయితంలా డబ్బును పీల్చేసుకోడు. తనకు రావలసిందాన్ని నయాపైసలతో సహా పిండుకొంటాడు. మంచివో చెడ్డవో అతను కొన్ని నిబంధనలు పెట్టుకొన్నాడు. వాటిని అరంగుళంమేర దాటడు. రాజకీయాల్లో ఎంతో ఫ్లెక్సిబిలిటీని చూపెట్టే సుందర్రావు తన నిబంధనలదగ్గర కొచ్చేసరికి శుద్ధ కన్సర్వేటివ్ అయిపోతాడు," అన్నాడు, భావనారాయణ.

"ఏదో వో చాదస్తం లేకుండా ఒక్కడూ కనిపించడు. అందుకే ఒకాయన 'మనిషి అభిప్రాయాలుండే జంతువు' అన్నాడు. నామట్టుకు నా కదంటే నిజమనిపిస్తుంది" అన్నారెవరో.

"అవిగూడా లేకపోతే అసలు మనిషే కాకుండా పోతాడేమో మరి" అన్నాడు భావనారాయణ.

"ఇన్నిటికీ – అసలు జరిగిందేమిటో తెలియనేలేదు" అన్నా న్నేను. ఈ దిక్కుమాలినగొడవను ఓ వొడ్డు పట్టిద్దా మని "వస్తున్నాను" అంటూ భావనారాయణ ఓ పొడిదగ్గు దగ్గి, కులాసాగా భుజాలు కుదుపుకొని, బాసీపట్లువేసుకు కూర్చున్నాడు. "నేను గుంటూర్లో ఉన్నప్పటి సంగతి. సుంద రావుతో పరిచయం – అది పరిచయంకాదు – ఏమనాలో గూడా తెలీకుండా ఉంది. గాఢంగా ఉన్నసమయమది. పనీ పాటాలేని కారణాన అస్తమానం, ఆస్పత్రిలోనే కూచుంటూ ఉండేవాణ్ని. సులభంగా పొద్దుపొయ్యేమాట నిజమేగానీ సాయంత్రానికి మనస్సు మాత్రం, అలిసిపోయినట్లయిపోయేది. అక్కడున్నంతసేపూ ప్రపంచమంతా రోగాలమయమే నని పించేది. అనాదినుండి ఈక్షణంవరకూ మానవుడు పరిసరా లతో చేసే యుద్ధంలో పరిసరాలే గెలుస్తున్నాయనీ, మాన వుడు క్రమక్రమంగా అపజయం పొందుతున్నాడనీ నాకు అనిపించేది...

"అవును ఆ పాయంట్ కే వస్తున్నాను. ఇన్నిశకాలు గడిచాయి, ఇన్ని మందులు కనిపెట్టారు. ఇన్ని సుఖాలు ఏర్పాటు చేశారు. కానీ మనిషి సుఖపడలేకపోతున్నాడు. సుఖంకోసం ప్రయత్నించినకొద్దికీ, అతను ఉచ్చుల్లో ఇరు క్కుపోతున్నాడు. కదిలినకొద్దికీ బంధాలు బిగుసుకొంటు న్నాయి. వాటిని విడదీసే ప్రయత్నంలో, అవి మరింతచిక్కు-

పడి అయోమయంగా తయారవుతున్నాయి ... ఎవరు గెలిచినట్టు మరి?"

"చెప్పానుగదూ, సుందర్రావు చాలా కరెక్టు మనిషని. ఒకరోజున రోగులందర్నీ పంపేసి, తాపీగా సిగరెట్టు ముట్టించాడు సుందర్రావు. 'చూడుభాయీ—' అంటూ ఏదో చెప్పబోతున్నాడు సుందర్రావు అంతలోనే టెలిఫోన్ ఘొల్లుమంటూ అరిచింది. మూడు నిమిషాలు—అవును-మూడు నిమిషాలయ్యాక, ఓ నిట్టూర్పు విడుస్తూ ఫోను పెట్టేశాడు సుందర్రావు. అతనిముఖంలో ఏదో గజిబిజి కదుల్లాడింది. కళ్ళల్లో ఇరుకుదనం చూపట్టింది.

"ఏమిటి విషయం?" అన్నాను.

"బయల్దేరదాం!" అంటూ మందులసంచీసర్దుతున్నాడు సుందర్రావు. నేను స్టెతస్కోపు అందించాను.

"రిక్షాలో కూచున్నానేగానీ సుందర్రావు ఎక్కడికో చెప్పలేదు. ఆ ఫోన్ కాల్ తాడికొండనించి వచ్చిందట. వాళ్లు అనవసరంగా ఆందోళన పడుతున్నారుగానీ నిజానికి అంత ఆదుర్దాపడవలసిన అవసరం లేదుట. 'ఫలానా' ఇంజెక్షను గనుక వెంటనే ఇస్తే ఆ రోగం టక్కున కట్టడిపోతుందట. ఆ నమ్మకం తన కుండబట్టే బయలుదేరా నన్నాడు సుందర్రావు.

"అదృష్టవశాత్తూ మేం వెళ్ళేసరికి బస్సు గూడా సిద్ధంగా ఉంది. ఇద్దరం వెళ్ళి కూచున్నాం. తీరా బయలుదేర బోయేముందు కండక్టరు పేచీపెట్టాడు. ఫిక్సెడ్ రేట్ ఆరణాలే అయినా, ఇవ్వాళా రేపు పదణాలు పుచ్చుకొంటున్నా మన్నాడు కండక్టరు. "ఇలాంటి తిరణాళ్ళసమయంలో నాలుగు

డబ్బులు రాబట్టుకోకపోతే, ఈ రూటు శుద్ధదండుగ గురూ" అంటాడు కండక్టరు. ఫిక్సెడ్ రేట్‌ను మించి దమ్మిడీ ఇవ్వ నంటాడు సుందర్రావు. కొసకు కండక్టర్ మమ్మల్నిదింపేసి, 'రయిట్' అంటూ ఓ కేకవేసి బస్సును తోలుకెళ్ళాడు.

"దిక్కుమాలిన పావలా పోతేపోయింది. ఎక్కితే కాకపోయిందా?" అన్నాన్నేను.

"సుందర్రావు నవ్వుతూ చూశాడు. 'నాబాధ నాలు గణాలకోసం కానేకాదు. ప్రభుత్వం ఓ రేట్ నిర్ణయించింది. అంతకుమించి పుచ్చుకోగూడదని శాసించింది. ఈ తొత్తుకొడు కులు, దాన్ని ఉల్లంఘిస్తున్నారు. అన్యాయంగా డబ్బుదోసేస్తు న్నారు. తెలిసిగూడా మోసపోవటం నాకిష్టంలేదు. ఇది మోసమని తెలిసిగూడ చేస్తూ, నా అంతరాత్మకు నే నెలా జవాబు చెప్పకోనయ్యా? వాడి తాట చీల్పిస్తాను. రా వెడదాం' అంటూ నన్ను పోలీస్‌స్టేషనుకు తీసుకెళ్ళాడు. ఆకారు నెంబరూ, కండక్టరు నెంబరూ చెప్పి, కేసు రిజిస్టరు చేయిం చాడు. ఇంతహడావుడీ జరిగాక, ఓ కానిస్టేబుల్ మాతో వచ్చి, ఆరణాల చార్జీకే మమ్మల్ని బస్సులో ఎక్కించాడు. సుందర్రావు కళ్ళలో ఎంత సంతృప్తి చూశానంటే — అంత చూశాను...

"ఆ తొమ్మిదిమైళ్ళ దూరమూ సుందర్రావు నాకు చట్టాలను గురించీ, శాసనాలను గురించీ చెపుతూనే ఉన్నాడు. జీవితంలో ప్రతివాడూ కొన్ని సూత్రాలను విధిగా ఆచరించా లనీ, అటువంటి వేవీ లేని బ్రతుకులో సంతోషంగానీ, సంతృ ప్తిగానీ ఉండటానికి అవకాశంలేదనీ చెప్పాడు సుందర్రావు.

గాంధీగారు అంత గొప్పవారు కావటానికి కారణం, ఆయన కొన్ని సూత్రాలను అవలంబించటమే నన్నాడు. అసలీ ప్రపంచమంతా కొన్ని సూత్రాలమీదనే నడుస్తూ ఉన్నదన్నాడు. సూత్రాలను తనకు తానుగా ఏర్పాటుచేసుకొని, వాటిని పాటించడంవల్ల, వ్యక్తిత్వం విస్తృతమవుతుందన్నాడు..."

"ఏమంటే నేంగానీ, మేము వెళ్ళినపనిమాత్రంకాలేదు. సుందర్రావు మందుసంచి తెరవవలసిన అవసరం లేకపోయింది. అంతకు రెండు గంటలముందు, అంటే సుందర్రావు, న్యాయం కోసం పోలీసుస్టేషను కెళ్ళినప్పుడు – రోగి చనిపోయాట్ట. అలాపోకుండా, సరాసరిబస్సెక్కి వచ్చినట్లయితే, సుందర్రావు మాటల్లో రోగి ధోకాలేకుండా బ్రతికేవాడు. ఆ ఆలోచన రాగానే, నాకు సాలొచ్చినట్లయింది. సుందర్రావుమీద నాకు చెప్పరానంత అసహ్యమేసింది! ఆదోవలో, అప్పటిసుందర్రావు ముఖం ఎలాఉందోగూడా నేను చూడలేకపోయాను. బహుశా, నీతిని అక్షరాలా పాటించినందుకు సంతృప్తి పడుచున్నాడేమో? ఒకవేళ లేదేమో మరి? ఏసంగతీ కనుక్కోటందుకైనా, మళ్ళా నే నతన్ని కలుసుకోలేదు." అన్నాడు భావనారాయణ కళ్ళు మూసుకుని, కణతలు గట్టిగా నొక్కుకొంటూ.

—o—